"అదృష్టఫలం"

★

శ్రీ మున్నంగి రాజగోపాలాచార్యులు

ఆ పాడుపడ్డ యింట్లో ఇప్పుడెవ్వరూలేరు. ఆ ఇంట్లో గూబలుతప్ప మరేవీ కాపురం చేసేట్లు అగుపించదు. అందులోను ఊరికి వెలుపల వుండటం మూలాన ఆ ప్రక్కకు ఒక్కరుకూడా తలెత్తి చూచేవాళ్లుకాదు. గాకనూ, ఆ ఇంట్లో భూతాలు, దయ్యాలు కాపురమున్నాయని, ఆ ఊరుమజీ తెలియని ఎవరో నూతనులు ఆ యింట్లో ప్రవేశించి ఆ దయ్యాల్కి, భూతాల్కి ఆహుతులై పొయ్యారని, ఒక పిచ్చి వదంతి వ్యాపించింది.

ఈ వదంతి ప్రాకిన లగాయితీ మరీ ఎవ్వరూ కూడా ఆ ప్రక్కకే పోవటాన్కి వెఱచేవారు. నిజాన్కి ఆ యింట్లో ఇద్దరు ముగ్గురు చచ్చింది నిజమేయైనా వాళ్లు దయ్యాల్తో పీడింపబడి చచ్చారో మరేకారణాలతో చచ్చారో తెలీకున్నా ఆ ఊర్లో మాత్రం దయ్యాల్తో చచ్చారనేమాట స్థిరంగా నిలచింది.

స్థిరంగా అంటిపెట్టుకొని ఆ యింటి చరిత్ర తెలిసిన కొందరు పెద్దలు ఈ ఇల్లుకూడా ఒకానొకప్పుడు సంసారంతో కళకళ లాడిందని చెప్తే దాన్ని నమ్మేవాళ్లేలేరు. అట్లని పూర్తిగా విననివాళ్లున్నా ఊసుపోవటానికి "ఆదేకథో కాస్త చెప్పుదురూ" అని అడిగినోళ్లకి ఆ పెద్దలు ఆ యింటి విషయం ఈలా చెప్పేవారు.

మంచివాడనిపించుకొని నవీన విద్యా సంస్కరణల కానవాలపై సత్సాంప్రదాయ కుటుంబంలో మెలగుతూన్న రాంజీ ఆ యింట్లో కాపురంచేసిన వాళ్లలో మొదటివాడు. ఆ యిల్లే అతని పిత్రార్జితపు ఆస్థి.

అతని తండ్రి తనకు తెలివి వచ్చీరాని దశలోనే ఈలోకాన్ని విడిచేడు. తల్లి తన పురిటిలోనే కళ్లుమూసింది. ఎటొచ్చి రాంజీని అతని అమ్మమ్మే పెంచి పెద్దవాణ్ణిచేసింది. ఎక్కణ్ణో రాంజీ మేనమామవున్నాట్ట; అతడు మాత్రం అప్పుడప్పుడూ వచ్చి కష్టసుఖాలు విచారించుకొంటూ సంసారాన్ని ఒడుదుడుకులు లేకుండా అమర్చేసి పోతుండేవాడట. మేనమామ సింగుజీ అంటే రాంజీకి తగని భయం. రాంజీని అమ్మమ్మ కళ్లల్లో పెట్టుకొని అతను కోరిందల్లా అమరుస్తూండేది. ఆమెవల్లే హూణ విద్య నభ్యసించాడంటే ఆమె ప్రేమ ఎంత పవిత్రమైందో గోచరిస్తుంది.

రాంజీకి పెళ్లి వయసు రావటం, మేనమామ పిల్లని మాట్లాడటం, అతని కామెను ముడిపెట్టడం ఇట్టే జరిగిపోయింది. ఆ అమ్మాయి పేరు గంగు. అతనికి (రాంజీకి) ఆ అమ్మాయంటే గిట్టదు. ఆమె పతిభక్తే పరమలోకంగా భావించేదేగాక సనాతన ధర్మమే తన విద్యుక్త ధర్మంగా భావించే ఆ పవిత్రురాల్ని రాంజీ భరింపలేకపోయాడు. మామగారిపై గల భయభక్తులే అతడు ఆమెను పెండ్లాడ చేసాయేగాక చిత్తశుద్ధిగ తాను అంగీకరించి కాదు. అమ్మమ్మకి చేదోడు వాదోడుగా వుంటూ భర్తను కంటిలోని పాపలా మెలగుతూ తన పనిలో తాను లీనమై పొయ్యేది గంగు. ఆ పేరు వినటానికైన అసహ్యంచుకొనేవాడు రాంజీ. చెప్పుకోదగ్గ అందం ఆమెలో లేకున్నా కురూపికాదు. మామగారి భయంచేతనైతేనేం "పాలిటికి పడింది పరమాన్నం" అన్న సామెత ననుసరించి యైతేనేం రాంజీ గంగును భార్య రూపేణా దాంపత్య సౌఖ్య మనుభవించేవాడు.

ఎవరో రాంజీ క్లాస్ మేటట, సుగుణ అనునామె అప్పుడప్పుడు అతన్ని చూచేదానికి వచ్చేది. ఆమె రావటమే తడవుగ ఆమెవున్న మూన్నాళ్లు విలాసంగా మాట్లాడుకోటం షైర్లు కొట్టడం జరిగేది. రాంజీని ఆమె ఎవర్రా అని అమ్మమ్మ అడిగితే "ఆ ... ఆ ... ఎవ్వరో కాదు నాజతలో చదివిన అమ్మాయి - సుగుణ అంటారు అమ్మమ్మా" అనేవాడు. మూన్నాళ్ళకే రాంజీ సుగుణ వీడిపొయ్యేవాళ్లు.

గంగు జీవితాన్ని సుగుణ రెండు మూడు తూర్లు అడ్డు తగిలినా ఇదెంత కాలంతే, అనే ధీమాతో వారికి ఆటంకమంటూ పెట్టేదికాదు గంగమ్మ. భర్తను తనలో ఇముడ్చుకోవాలని, భర్తలో తాను ఇమిడిపోవాలని పడే ఆరాటంతో అప్పటి కప్పుడే తాపత్రయపడి, నవీననాగరికతను వాంఛించే భర్తకు అనాదరితురాలై అంతటితోనే తృప్తిపడి పొయ్యేది. ఆమె పూజాఫలితమో అన్నట్లు ఆమెకో చక్కని అబ్బాయి కల్గేడు. ముమ్మూర్తులా తండ్రి చాలే. అబ్బాయిని చూచియైనా తన కోర్కెలు నెరవేరక పోతాయాని స్వర్గానికి నిచ్చెనలు వేసేది గంగమ్మ. రాంజీ అంటే ఎంతో గంగుకూడా అమ్మమ్మకి అంతే.

కానీ రాంజీలో ఏవో తీరని కోర్కెలు అట్లే నిలిచిపోవటంచేత కాబోలు ఎప్పుడూ చింతా హృదయంతోనే తపిస్తూంటాడు. ఇక్కడ రాంజీకి పిల్లాడు పుట్టడమేమిటి అక్కడ సింగుజీ చావడమేమిటి? ఇట్టే జరిగిపోయింది. ఇప్పుడు రాంజీలో మేనమామ పోయినలగాయితీ హృదయం తేలికైనట్లయింది. తనలోవున్న ఆ కాస్త భయం ఊడి పోయింది. తన పని ఇక నెరవేరుననేట్లు ఏదో యోచించి తల ఊపుకొనేవాడు.

నాడు గంగు పిల్లవాన్ని పాలిచ్చి తొట్టిలో పండేసి పిల్లాడు లేస్తే ఊపమంటూ అమ్మమ్మకిచెప్పి తాను పశువులకి గడ్డి తెచ్చేందుకు పోయింది. ప్రొద్దున్ననగాపోయి మధ్యాహ్నానికల్లావచ్చి పశువులముందు గడ్డిపడేసి వంటా, వార్పుచేసి పతికోసం ఎదురు చూచింది. కానీ అతను ఇంట్లోలేడు. పని వుంటేనే తప్ప ఎక్కడికి కదిలేరకంకాదని తన భర్త విషయం తెలిసిన గంగు అమ్మమ్మని అడిగింది. "ఇంతకు ముందు వస్తూండిని అమ్మాయి రాగా అలా వెళ్లాడమ్మా" అంది అమ్మమ్మ. ఏనాడూ లేని ఆవేదన ఆనాడెందుకో గంగమ్మలో కల్గింది. వెయ్యిదేవుళ్ళకి మొక్కుకొంది. ప్రొద్దు తిరిగినా భర్తవచ్చే జాడలు అగుపించటంలేదు. భర్తరాక కొఱకు తానూ అన్నంతినక ఎదురు చూస్తూంది. కానీ ఆశ ... ని ... రా ... శ అయ్యింది.

ఊరంతా తిరిగింది. భర్తజాడ అగుపించలేదు. ఊళ్లో అక్కడక్కడ అనుకొనే మాటలనుబట్టి తన భర్త సుగుణతో లేచిపోయాడన్న వార్త వింది. గుండె గుభేల్లున బ్రద్దలుకాగా బరువెక్కిన హృదయంతో ఇంటి ముఖం పట్టింది. భర్త కొఱకై అహర్నిశాదులూ ఏడ్చింది. అమ్మమ్మ మట్టుకు ఎంతో ఓదార్చింది. పిల్లాన్ని చూడాలమ్మ అంది. తుట్టతుదకు వాడు చచ్చాడనికూడ అనుకోమ్మా అంది ఆవేశం, దుఃఖం పట్టలేక అమ్మమ్మ. ఆ మాటలు వినేసరికి గంగమ్మ చెవులు మూసుకొని "హరి ... హరీ ... ఎంతమాట! అలా అనకు అమ్మమ్మా! ఆయన నానుంచి పొందలేనిదేదో గొప్ప సుఖాన్ని సుగుణ ద్వారా పొందబడడంవలనే వారాలాపోగల్గేరు. వారు ఎక్కడనో ఒక్కచోట సుఖంగావుంటే నాకంతేచాలు. ఆ సుగుణ ఎంత ధన్యురాలో" అంది గంగు. కేవలం తన కోసమే కాకపోయినా పిల్లాడి కోసరమై బ్రతకలేక బ్రతుకుతూంది గంగమ్మ. పిల్లవాని చిఱునవ్వు పంచలలో భర్త పోకడను క్రమేపి మరువజొచ్చింది.

కాలచక్రం క్రమేపి సాగిపోతూంది. పిల్లాడి కోసరమైనా రాకపోతారా అని అనుకొన్న అంత్య ఆశలుకూడా అడియాసలయ్యినవి. గంగమ్మ హృదయంలో ఆ మిగిలిన చిన్నకోర్కెకూడా ఇక ఫలించదనుకొంది. ఈ కాలరథ చక్రంలో గంగమ్మ లాంటి అభాగినుల జీవితాలెన్ని ఈలా నలిగి మసియై పోతూన్నాయో??? ఊరు విడువాలనుకొంది గంగమ్మ. కాదు ఉన్నవూరులోనే చావాలంది అమ్మమ్మ.

ఎండిన కొమ్మనుంచి రాలిపోయే ఆకులాగా అమ్మమ్మకూడా గంగమ్మనుండి రాలిపోయింది. గంగమ్మ జీవితంలో తిరిగి దుఃఖాశ్రువులు ఆరంభమయ్యాయి. కానీ భర్తను ఏలాగు; పిల్లాడి చిఱునవ్వు పంచల్లో మఱచిందో అల్లాగే అమ్మమ్మ దుఃఖాన్నికూడా దిగమ్రింగుకొంది. బ్రతుకుపై

(మిగతా 490-వ పేజీలో)

(480-వ పేజీలో తరువాయి)

అప్పుడప్పుడు అసహ్యత కల్గుతూన్న తన కోరికై కాకున్నా తన కొడుకు కోరికై బ్రతుక జొచ్చింది.

ఊళ్లో కలరా వచ్చిందన్నారు కొందరు, కాదు ప్లేగు అన్నారు మరి కొందరు. ఇనాక్యులేషన్సు చేసుకొంటే ఏవి దరిచేరవని అంటూన్నారు ఆఫీసర్లు. చచ్చిపొయ్యే జనానికి అంతేలేదు. కొందరికి కొందరు అప్పటి కప్పుడే గ్రామంవదలి వెళ్ళేరు. ప్రొద్దువనగా వచ్చింది. అంతే సందె చీకటులు అలముకోకముందే గంగమ్మ కుమారున్ని కలరా కాజేసింది. అంతే ప్రొద్దున ఆ ఇల్లు కాళీ. గంగమ్మ ఎక్కడికి వెళ్ళిందాఅని ఎందరో ఎన్నో చోట్ల వెతికారు. కానీ నిష్ఫలమైపోయింది. ఎక్కణ్ణో పడి చచ్చిందనుకొన్నారు. అంతే ఆమె కధని అల్లికలల్లికలుగా అనేక విధాల అల్లి పలుపలు విధాల అనుకొన్నారు. కానీ వాండ్లెక్కడో జీవిస్తూంటారురాంటే పనేమిరా అని పెడచెవిన బెట్టేరు. వినినవాళ్లు విన్నారు. లేనివాళ్లులేదు. అప్పటినుంచి అల్లా పాడుబడింది. అప్పటినుంచి ఇప్పటివరకు గంగమ్మ అత్తాపత్తా తెలీదు అని చెప్పేవారు.

కానీ గంగమ్మ చావలేదు. తనకు "నా" అన్న దిక్కుగల వాళ్ళంతా తననుంచి వేరై పొయ్యారు. తానుమాత్రం చావలేక బ్రతుకుతూ బ్రతికేందుకు నానావస్థలు పడుతూంది. బుద్ధిచెడి దేశదేశాలు తిరుగజొచ్చింది. ఆమెని తిక్కదన్నది లోకం. బిడ్డల్నితినే మహమ్మారి అని క్రొత్తపేరు పడిందామెకి. ఎవరి చంకలోనైనా బిడ్డ వుండటం తటస్థించిందా అమాంతంగా గంగు ఆ బిడ్డడిని తన చేతుల్లో ఎత్తి నాయనా అని బిడ్డడిని ముద్దుల్లో నింపేది. బిడ్డకామందులు తమ బిడ్డల్ని ఆమెనుంచి తీసికోడానికి ఎంతో శ్రమ పడేవారు. దాన్ని బట్టి గంగు అంత దూరంలో వస్తూందనగా బజార్లో వున్న తమ పిల్లల్ని బరబరా ఈడ్చుకొనివచ్చి యిండ్లలోకి పిలుచుకెళ్లి దభేల్లున వాకిలివేసేవారు.

ఆమెలో కరుడువారిన ఆశాజ్యోతులు అట్లే అణగారిపోయాయి. దొరికినప్పుడు తిని దొరకనప్పుడు పస్తుండటం ఆమెకొక విధాయిక కృత్యమైంది. ఎప్పుడో తనలో జీర్ణించుకపోయిన మధుర స్మృతులు తిరిగి మొలకలెత్తగలవేమోననే ఆశతోనే తిరుగుతూంది. జీర్ణించుకపోయిన ఆమె డొక్కలు నడ్డిపుకు అనుకొన్నాయి. "చుర్"మని పేగు కొట్టుకొన్నప్పుడు ఊళ్ళో అడుక్కోవటం, దాంతో కాలం గడుపుకోవటం చేస్తూందా గంగు.

గంగమ్మ ఇంకొక గ్రామానికి పోవటానికి రైలెక్కటం, టికెట్ కలెక్టరు నాల్గుతన్ని ఆమెను ఒకచోట దింపటం, దించిన గ్రామంలో ఆ రోజు కాలం వెళ్ళబుచ్చటం జరిగేది. ఆ దినంకూడా మామూలుగా ఆమెని దింపేసారు. "అమ్మా! నీకడుపులో మంచి బిడ్డలు పుట్టుతారు. అంత అన్నం పెట్టండి తల్లీ" అని గంగు ఒక యింటి ముందు నిలబడి అక్కడ అరుగుపై కూర్చొన్న ఒక విధవని అడిగింది. ఆమె మహా చండశాసనురాలు. "ఏమే! నీకేం పొగరే. అయ్యో! ఆయనగారు చచ్చి ఏడాదైనా కాలేదు తిరిగి నాకు పిల్లలెంటే; నీ మొహం మండా; నేనేమన్నా పోకిరిదాన్ననుకొన్నావా?" పో ... పో ... అని గద్దించి ... థూ ... అని ఉమ్మింది. దైవమా అంటూ నిస్పృహతో వెళ్ళింది గంగు.

నాడుకూడా దింపేసారు గంగుని. రైలునుంచి దిగి ఊళ్ళో కెళ్లింది. నాల్గు రోజులనుంచి అన్నం లేక స్పృహలేనంత స్థితిలోవుంది. ఊరు వెలుపల ఈమెలాంటి నిరుపేదలు నివసించే ఆలయం ఒకటి వుంది. అర్చన అంటూ లేకపోవటంచేత దేవుడు ఎల్లవేళల దర్శనమిస్తూంటాడు. ఎవరో ఒకామె తాను తెచ్చుకొన్న రొట్టెముక్కని తింటూండటం గంగు చూచింది. ఆమెలోని ఆకలి తీక్ష్ణమైంది. ఒళ్ళంత కండ్లుచేసి ఆశతో ఆమెను చూచింది. ఆమెభావం రొట్టె తింటూన్నామె కనిపెట్టి ఒక్క

ముక్క విఱిచి గంగుకు అందించింది. దాన్నితిని ప్రక్కనపారే యమునలో నీళ్లు త్రాగి ఆత్మతృప్తి పడింది. ఈలా రెండుమూడు రోజులా ఊళ్ళో కాలం గడిపిందామె.

నాడు ఆ దేవాలయంలో ఎవ్వరూలేరు గంగు తప్ప. మటమట మధ్యాహ్న సమయం. సూర్యుడు తన ప్రచండ కిరణాల్తో లోకాన్ని కాల్చేస్తున్నాడు. లోకంతోబాటు గంగమ్మ ఉదరంలోని ఆకల్ని పురికొల్పి దప్పికి తన్నుకలాడేట్లు చేస్తున్నాడు. ఊళ్ళో తిరిగే శక్తిలేక ఆలాగే దేవాలయ కుడ్యానికి ఆనుకొని వగరుస్తూంది. దేవతా సన్నిధివైపు తలెత్తి చూచింది. అప్పుడే అక్కడ ఎవ్వరో నైవేద్యం కొఱకు పళ్ళేరంలో ఫలాదులుంచి వుండటం చూచింది. వోళ్లు కళ్లు అంతా ఒకటిగా చూచింది. ఆకలి పెకేసుకొని వెల్లుబుకుతూంది. చుట్టూపట్టూ చూచింది, ఎవ్వరూ లేకపోవటం గమనించింది. మెల్లగ లోపలికి బయల్దేరింది. పళ్ళేరంలో చెయ్యిపెట్టీ పెట్టకముందే "ఏయ్! ఎవ్వరూ నువ్వు!" అనే మాటలు ఆ దేవళం అంతా ప్రతి ధ్వనిస్తూ వినిపించిందామెకో కేక.

వెనుదిరిగి చూచింది. ఎట్ట ఎదుట గంభీరాకృతితో తీక్ష్ణంగా చూస్తూన్న ఒక యువకున్ని చూచింది. ఆ చూడటం అనేది 8 నిముషాలు పట్టింది. అదేమో అతన్ని చూడగానే కరుడువారిన ఆశామొక్కలు ఆమెలో మొలకలెత్తాయి. కళ్లు నులిమి చూచింది, ఆశ్చర్యపడ్డది. కలా! ... లేక ... నిజమా ...? అని మరి మరి చూచిందాతన్ని. తన భర్త ప్రతిబింబం ధ్వని, దృక్కులు ఆమెయింతకు ముందెప్పుడో జీర్ణించుకొన్నదగుటచేత అతనెవరైంది కనుక్కొంది. ఇక క్షణం నిలువలేక పోయింది. "మీ ... రా ..." అనే అస్పష్ట సంభాషణోపక్రమణకు పునాది మాటలు ఆమె నుంచి వెలువడ్డాయి.

అతనికేం అర్థంకాలేదు. ఒక్కడుగు వెనక్కవేసి బాగా చూచాడు. ఆమెను కనుక్కోగల్గేడు. తన గంగు దీనస్థితి అతన్ని ఆశ్చర్యాన్ని కలిగించింది. "క్ష ... మిం ... చ ..." యనే దీన వాక్కులతో అతని పాదాలపై వ్రాలింది గంగు. "ఏం! ఎందుకీలా అయ్యావ్? అబ్బాయి ఏడి? అమ్మమ్మ ఏది?" అనే మాటల్తో గబగబ అడిగాడు. అమ్మమ్మ ... అ ... బ్బా ... యి ...? అని చెప్పలేక చెప్పలేక జరిగిన యథార్థత తెల్పింది. అతనిలోకూడా ఏదో ఆవేదన బయల్దేరింది. ఆమెని ఎత్తి, చిన్నగ చెక్కిళ్లపై జారే కన్నీటి ప్రవాహాన్ని ఆపుకోనేట్లు తుడుస్తూ, గాద్గితంగా "ఎంత దానివి ఏలామారావు? నాదే అపరాధం నన్ను క్షమించవూ" అని అన్నాడు ఆమెనిచూచి.

భర్త కరుణార్ద్రి హృదయాన్ని స్పందించింది. దుఃఖభాజ్యమైన తన జీవితపు పోకడలో సంతోషపక్కిలోని ఒక్క కణపును నేడామె చవిచూచింది. ముదముతో ఆమెను ఇంటికి తీసుకెళ్లి తగిన ఔషధ సేవ చేయించి బాగుచేయించాడు రాంజీ. సుగుణ (రాంజీ రెండవ భార్య) ఆమెకు తగిన సేవలు చేసింది. గంగు ఆమె ఉపచర్యలకు ఆశ్చర్యపడింది. ఆమె ఔదార్యాన్ని వేనోళ్ళ పొగిడింది.

ఇప్పుడు రాంజీగార్కి భార్యలిద్దరు. ఇద్దరిని సమదృష్ట్యా చూస్తూ ఆనందంతో వెల్లివిరిసిపోయారు. సుగుణ, గంగు ఇద్దరూ గర్భవతులయ్యారు. ప్రసవించటం ఒకేదఫా కల్గటంలో ఆశ్చర్యమైంది. గంగుకు మగపిల్లవాడు, సుగుణకు ఆడమ్మాయి. అమ్మమ్మ జ్ఞాపకార్థం అమ్మాయికి అమ్మాజీ అని ముందు పిల్లకాయ జ్ఞాపకార్థం అబ్బాయికి చిన్న అబ్బాయి అని పేర్లు పెట్టారు. బారసాల వైభవోపేతంగా సాగింది. చాల మందికి విందులు జరుపబడ్డాయి. ఆనందసాగరంలో ఓలలాడిపొయ్యారా కుటుంబమంతాను.